# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

సోమవారం | 4 ఆగస్టు 2025 | పేజీలు 8




మున్సిపల్ అధికారుల సౌజన్యంతో..
ప్రణీత్ అనుమతుల్లేని ఐదంతస్తులు..

# మేడమ్ కూల్చేశారు..! కట్టనిచ్చారు..!





ప్రణీత్ అక్రమ నిర్మాణం కూల్చేసి, కట్టనిచ్చిన.. టిపిఎస్ సంజునా..

## ప్రణీత్ ఐదంతస్తుల అక్రమ నిర్మాణంపై చోద్యం చూస్తున్న కమిషనర్..!

- దుండిగల్ మున్సిపాలిటీలో రాజ్యమేలుతున్న "కమిషనర్-టిపిఎస్"..
- మల్లంపేట్ 100 ఫీట్ల రోడ్డులో కూల్చేసిన ప్రణీత్ అక్రమ నిర్మాణంపై బేరం..?
- ఐదంతస్తులు నిర్మించి అనుమతులకు వెళ్ళిన ప్రణీత్ నరేంద్ర కుమార్..
- దుండిగల్ మున్సిపాలిటీలో మూడుసార్లు పర్మిషన్ తిరస్కరించినట్లు సమాచారం..
- బౌరంపేట్ 166 అక్రమ రోడ్డుతో పాటు.. మల్లంపేట్ ప్రణీత్ కట్టడానికి ఒప్పందం..?
- వన్‌షాట్ టు బర్డ్స్.. అక్కడ 166.. ఇక్కడ 100 ఫీట్ల రోడ్డులో ప్రణీత్ అక్రమ నిర్మాణం..
- రూ. లక్షల్లో ముడుపులు ముట్టాయని, సమాచారం.. అందుకే చర్యలు శూన్యం..
- 2024 జూలై టౌన్‌ప్లానింగ్ అధికారి సంజునా ఆదేశాలతో కూల్చివేతలు..
- ఏడాది తిరగక ముందే..! టిపిఎస్ సంజునా సహకారంతో అక్రమ నిర్మాణం పూర్తి..
- గ్యాస్ కట్టర్‌లతో కూల్చేసి దృఢత్వం లేని ప్రణీత్ బిల్డర్స్ ఐదంతస్తుల అక్రమ నిర్మాణం..
- మల్లంపేట్ చైన్‌మెన్ సతీష్ పర్యవేక్షణ లోనే ఈ సెటిల్మెంట్‌లు..? అంటూ ఆరోపణలు..
- అక్రమార్కులకు- అధికారులకు వారధిగా చైన్‌మెన్ సతీష్ ఉన్నట్టు స్పష్టం..?
- అక్రమ నిర్మాణాలకు సలహాలు, సూచనలు ఇస్తూ, సతీష్ పర్మిషన్‌లు ప్పించడం..?
- ఓ వ్యక్తికి చెందిన ఒకే స్థలానికి రెండు పర్మిషన్‌లు ఇప్పించిన చైన్‌మెన్ సతీష్..

దుండిగల్ మున్సిపాలిటీలో, అక్రమ నిర్మాణాలతో అధికారులు బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. అధికారుల ముసుగులో వసూళ్ళకు పాల్పడటం, చర్యలకు వెనకడుగు వేస్తూ..! నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారు.. అక్రమ నిర్మాణాలను కూల్చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులే..! బిల్డర్‌లతో బేరం కుదుర్చుకుని, పునర్నిర్మాణాలకు, బాహాటంగానే సహకరించడం పరిపాటిగా మారింది.. వివరణ కోసం మీడియా ఫోన్‌లు చేసినా సంబంధిత అధికారులు స్పందించరు.. కార్యాలయానికి వెళ్ళితే, టౌన్‌ప్లానింగ్ మేడమ్ సంజునా, మూడు మున్సిపాలిటీలకు ఇంచార్జ్‌గా విధులు నిర్వర్తిస్తున్నారని, పొంతనలేని సమాధానం చెప్పడం గమనార్హం.. విజిలెన్స్, ప్రభుత్వానికి సమాచారం చేరవేసే ఇంటెలిజెన్స్ వ్యవస్థను కూడా మున్సిపల్ అధికారులు ప్రలోబాలకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. అందుకే విజిలెన్స్ ఊసేలేదని విమర్శలు.. దుండిగల్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సంజునా ఖాతాలోని అక్రమ కట్టడాలు చూడండి.. మచ్చుకు కొన్ని (1)..గండిమైసమ్మ చౌరస్తా సమీపంలోని అపర్ణ కన్‌స్ట్రక్షన్ పక్కనే సర్వే నెం.169 నిషేధిత జాబితాలోని ప్రభుత్వ భుమిలో "రాంబాబు అక్రమ షెడ్లు" ఒకసారి కూల్చేసి బేరం..? (2)..బహుదూర్‌పల్లి మేకల వెంకటేష్ ఫంక్షన్ హాల్ పక్కనే 800-900 గజాల్లో మాజీ సర్పంచ్ అక్రమ నిర్మాణం.. బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులోని బాస్కర్‌రెడ్డి అపార్ట్‌మెంట్ సెటిల్మెంట్‌లు ఆక్రమణ, రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో కమర్షియల్ కార్యకలాపాలు.. నారాయణ హైస్కూల్ ఏసీ క్యాంపస్.. (3) బౌరంపేట్ సర్వే నెం.567 కన్జర్వేషన్ జోన్‌లో వ్యాసా పాఠశాల అక్రమ నిర్మాణాలు..(4)బౌరంపేట్ రింగ్‌రోడ్డు సమీపంలోని, బడా నిర్మాణ సంస్థలకు, 40 ఫీట్ల రోడ్డు కోసం ఎనిమిదేళ్ళ నిరీక్షణకు, మున్సిపల్ కమిషనర్ పక్కా పథకం ప్రకారం స్కెచ్.. (5) మల్లంపేట్ ప్రణీత్ బిల్డర్ కామరాజు నరేంద్ర కుమార్‌కి చెందిన ఐదంతస్తుల అక్రమ నిర్మాణాన్ని 2024లో కూల్చేసిన టిపిఎస్ సంజునా..! బేరం కుదుర్చుకుని, 2025 జూలై వరకు పునర్నిర్మాణానికి టిపిఎస్ గ్రీన్ సిగ్నల్.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 03:

-2లో



2024 జూలై 3న టిపిఎస్ సంజునా ఆదేశాలతో డిమాలిషన్.. ఫైల్‌ఫోటో..

## హైదరాబాద్ నుంచి విజయవాడకు 2 గంటల్లో చేరుకునేలా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎల్బీనగర్ నుంచి పెద్దఅంబర్‌పేట్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కారిడార్‌కు సంబంధించి వనస్థలిపురంలో క్షేత్ర స్థాయిలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు.

-3 లో

## బర్త్‌డే పార్టీలో డ్రగ్స్.. ఆరుగురు ఐటీ ఉద్యోగుల అరెస్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో డ్రగ్స్ కలకలం రేగింది. సెరీన్ ఆచార్జ ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్, విదేశీ మద్యంతో ఐటీ ఉద్యోగులు బర్త్‌డే వేడుకలు చేసుకున్నారు. పక్కా సమాచారంతో ఫామ్‌హౌస్‌లో పోలీసులు సోదాలు చేపట్టారు.


-3 లో



# మేడమ్ కూల్చేశారు..! కట్టనిచ్చారు..!



గండిమైసమ్మలో సర్వే నెం.169 నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమిలో "రాంబాబు" అక్రమ షెడ్డు..



Sri Anumula Revanth Reddy
Hon'ble Chief Minister of Telangana

REGISTRATION & STAMPS DEPARTMENT
Government of Telangana (/index.htm)

Sri Ponguleti Srinivasa Reddy
Hon'ble Minister for Revenue, Telangana

Prohibited Properties 2

District Name
MEDCHAL-MALKAJGIRI
Mandal Name
DUNDIGAL GANDIMAISAMMA
Village
DOMMARA POCHAMPALLE
Survey No
169

Prohibited Properties in Rural Prohibited Register

Search

| Sro Name [Sro Code] | Survey No. | Sub Sy No. | Plot No. | Extent (Unit) | Volume No. / Page No. | Reason | Letter/Memo/Order/Notification No. / Letter/Memo/Order/Notification Date | Remarks | Authority |
|---|---|---|---|---|---|---|---|---|---|
| MEDCHAL (R.O) [1504] | 169 | - | - | 5.0(G) | 1 / 21 | Govt Land | G.O.MS.NO. 283 / 09-03-2005 | GAZETTE NOTIFICATION NUMBER 134 DATED. 10/03/2005 | |
| MEDCHAL (R.O) [1504] | 169 | - | - | 0.05() | - / - | Govt Land | LR.NO E1/MDL/D1/1532/2017 / 24-07-2024 | State Government | |

https://registration.telangana.gov.in/prohibitedPropertyDetails.htm

నిషేధిత జాబితాలో ఉన్నట్టు ఆధారాలు..

- మొదటి పేజి తరువాయి

దుండిగల్ మున్సిపల్ అధికారుల బరితెగింపుకు హద్దు అదుపు లేకుండా పోతోంది.. ఈ అక్రమ నిర్మాణాల వ్యాపారం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో ఇదే దందా కొనసాగుతుందో ఏమోనని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. మేడ్చల్ జిల్లా లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ జోక్యం చేసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.. ప్రమాదకర నిర్మాణాలను ప్రోత్సాహిస్తూ మున్సిపల్ "కమిషనర్-టిపిఎస్" మామూళ్ళ మత్తులో జోగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..! అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో ప్రజలను ప్రమాదంలో పెడుతున్నారు.. మరోవైపు దుండిగల్ మున్సిపాలిటీలో "తగ్గేదే లే" అంటున్న కరెప్షన్ దందా మూడు పూవులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది.. గండిమైసమ్మలోని దొమ్మర పోచంపల్లి సర్వే నెం.169 ప్రభుత్వ భూమిలో "రాంబాబు" అక్రమ షెడ్డు అధికారుల సౌజన్యంతో ఆదివారం ప్రజాప్రతినిధులు, నేతలతో ప్రారంభించారు.. మల్లంపేట్‌లో 2024 జూలై 3న కూల్చేసిన ఐదంతస్తుల ప్రణీత్ అక్రమ కట్టడానికి తాంబూలంగా రూ. లక్షల్లో ముట్టాయని ఆరోపణలు వస్తున్నాయి..గండిమైసమ్మలోని "రాంబాబు"అక్రమ షెడ్డు వ్యవహారంలోనూ, గెస్ట్‌హౌస్‌లో సెటిల్మెంట్ జరిగినట్లు వినికిడి..

**ఆవుచేలో మేస్తే..! దూడ గట్టున మేస్తుందా..? ఈ సామెతకు దుండిగల్ మున్సిపల్ అధికారులు అద్దం పడుతున్నారు.. మరోవైపు కమిషనర్- టౌన్‌ప్లానింగ్ అధికారులు కరెప్షన్‌కి బరితెగిస్తుంటే..! వారి యవ్వారం తెలిసిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తమదైన శైలిలో అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.. మల్లంపేట్ మాదాసు రామచంద్రయ్య కాలనీ సమీపంలో ఓ వ్యక్తికి చెందిన సుమారు 270 గజాల స్థలానికి.. చైన్‌మెన్ సతీష్ రెండు అనుమతులకు సలహా, సూచనలతో పర్మిషన్ ఇప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి.. పర్మిషన్ జీ ప్లస్ 2 అంతస్తులు ఉండగా, చైన్‌మెన్ అండతోనే అదనంగా 2 అంతస్తులు నిర్మాణంపై ప్రశ్నించగా, టిపిఎస్ సంజునా నుండి సమాధానం లేదు..! "ఆవు చేనులో మేస్తే..! దూడ గట్టున మేస్తుందా..? యధారాజా తథాప్రజా.. చర్యలు తీసుకోలేని కమిషనర్ అండ్ టిపిఎస్ చైన్‌మెన్‌ని ప్రశ్నించగలరా..?**

## ఎట్టకేలకు రాంబాబు అక్రమ షెడ్డు ప్రారంభోత్సవం..!

దుండిగల్ మున్సిపల్ అండ్ రెవెన్యూ అధికారుల బరితెగింపు విధులు, ప్రజల ఆస్తులను హరిస్తున్నాయి..! ప్రమాదకర కట్టడాలకు దారితీస్తున్నాయి.. దుండిగల్ మండలం దొమ్మర పోచంపల్లి సర్వే నెం. 169 ప్రభుత్వ భూమిగా, నేటికీ నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ..! అధికార, ప్రతిపక్ష నేతల అండ, దండా ఉన్న అక్రమ షెడ్ల రాంబుకు అధికా రుల అండా దండా కూడా దండిగానే లభిస్తుందని, ఈ అక్రమ షెడ్డుతో స్పష్టమవుతుంది.. అధికారుల తీరు ప్రభుత్వ ఆస్తులకు గండంగా తయారైంది.. రెవెన్యూ అధికారులకు పూర్తిగా బాధ్యతలేదని తెలు స్తోంది.. మున్సిపల్ కూల్చేసినప్పటికీ ప్రయోజనం శూన్యం..! అక్రమ కట్టడాలతో ఒప్పందం కుదుర్చు కుని, ప్రజలని ప్రమాదంలో పెడుతున్నారు.. కూల్చివేతలతో దృఢత్వం కోల్పోయిన ప్రమాదకర కట్టడాలు నిర్మించు కోవడానికి లక్షల్లో బేరం కుదుర్చుకుని, అక్రమ కట్టడాల పునర్నిర్మాణాలని ప్రోత్సహించి ప్రజలను రిస్కులో పెడుతున్నారు.. పత్రికల్లో వార్తలు వచ్చినా దున్నపోతు మీద వర్షం పడిన చందంగం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాలతో బేరం కుదుర్చుకుని చర్యలు విస్మరిస్తున్నారు.. ఈ వ్యవహారం మొత్తం మేడ్చల్ జిల్లా లోకల్‌బాడీ అదనపు కలెక్టర్‌కి తెలిసే జరుగుతున్నట్టు బోగట్ట..!

## అసలైన అక్రమార్కులు ఎవరు..? అధికారులా..? నిర్మాణ దారులా..?

పాలుత్రాగే పిల్లి కళ్ళు మూసుకుని తనను ఎవరూ చూడలేదని అనుకుంటుందట.. అలా ఉంది దుండిగల్ మున్సిపల్ అధికారుల తీరు.. అసలైన అక్రమార్కులు ఎవరు..? అనే ప్రశ్నలు తీవ్రంగా సందిస్తున్నాయి.. నేతల పలుకుబడి ఉందనే అహంతో టౌన్‌ప్లానింగ్ అధికారి ఇష్టానుసారంగా విధుల నిర్వహణ, ప్రమాదకర కట్టడాలకు తెరలేపుతున్నాయి.. మల్లంపేట్ ప్రణీత్ అక్రమ కట్టడంపై గత కమిషనర్ కె.సత్యనారాయణ హయాంలో చర్యలు తీసుకున్న టిపిఎస్ సంజునా..! ప్రస్తుత కమిషనర్ హయాంలో..! ప్రణీత్‌తో అక్రమ నిర్మాణం కట్టుకోవడానికి "డీల్" కుదుర్చుకోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది..! అసలు అక్రమార్కులు అధికారులా..? లేక అక్రమ నిర్మాణ దారులా..? అనేది ప్రశ్నార్థకంగా మారిందని.. పలువురు ఎద్దేవా చేస్తున్నారు..టిపిఎస్ సంజునా ఆదేశాలతో కూల్చేసిన అదే అక్రమ నిర్మాణం ప్రస్తుతం పూర్తిచేయడానికి సహకరించిన టిపిఎస్, కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు..

## 100 ఫీట్ల రోడ్డులో.. అనుమతుల్లేని ఐదంతస్తులు..

దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్ ప్రణీత్ అక్రమ కట్టడంలో "బిగ్ డీల్"..! కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. ఓ అధికారపార్టీ నేత మధ్యవర్తిత్వంతో మున్సిపల్ అధికారులకి ఒప్పందం.. కుదిరినట్ట సమాచారం.. 100 ఫీట్ల ప్రపోజ్‌డ్ రోడ్డులో, 5 మతస్తుల అక్రమ కట్టడాన్ని 2024 జూలై 3న కూల్చేసిన టిపిఎస్ సంజునా మేడమ్, బేరం కుదుర్చుకుని, పునర్నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు, చర్యల్లేని అధికారుల తీరే, స్పష్టతను ఇస్తుంది.. 2024 జూలై 3న గ్యాస్ కట్టర్‌లతో స్లాబుల కూల్చివేసిన అధికారులకి, ఓ కాంగ్రెస్ నేత కుమారుడు ఒప్పందం కుదిరేందుకు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం..! కూల్చివేతలతో దృఢత్వం కోల్పోయిన అక్రమ కట్టడం మళ్ళీ నిర్మాణం పూర్తి చేయడానకి మాత్రం, మరో కాంగ్రెస్ నేత, బౌరంపేట్ 166 ప్రభుత్వ భూమిలో రోడ్డుతో కలిపి ప్రణీత్ డీల్ కుదిరినట్టు స్పష్టమవుతుంది.. అందుకే ప్రణీత్ అక్రమ కట్టడానికి సీఎంవో సిఫార్సులు అంటూ మీడియాకు సమాధానం చెప్పడం విశేషం..

## అధికారుల అండతో అక్రమ కట్టడాలు మచ్చుకు..




బౌరంపేట్ సర్వే నెం.567 కన్జర్వేషన్ జోన్‌లో వ్యాసా పాఠశాల.. నిబంధనలకు విరుద్ధంగా డీఈఓ పర్మిషన్..






మల్లంపేట్ చైన్‌మెన్ సౌజన్యంతో.. జీ ప్లస్ 2 పర్మిషన్‌తో అదనంగా 2 అంతస్తులు..



బహదూర్‌పల్లిలో కాంగ్రెస్ నేత, మాజీ సర్పంచ్ అక్రమ నిర్మాణం..



బౌరంపేట్‌లో రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో నారాయణ హైస్కూల్ ఏసీ క్యాంపస్.. డీఈఓ పర్మిషన్..




మల్లంపేట్‌లో అక్రమ షెడ్డు..

## హైదరాబాద్ నుంచి విజయవాడకు 2 గంటల్లో చేరుకునేలా గ్రీన్ ఫీల్డ్ రోడ్డు

- మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ నుంచి విజయవాడకు 2 గంటల్లో చేరుకునేలా గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

## బర్త్‌డే పార్టీలో డ్రగ్స్.. ఆరుగురు ఐటీ ఉద్యోగుల అరెస్ట్

- మొదటి పేజీ తరువాయి

రూ.రెండు లక్షల విలువైన డ్రగ్స్‌తో పాటు 3 కార్లను స్వాధీనం చేసుకున్నారు. బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్న వారికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. ఆరుగురు ఐటీ ఉద్యోగులకు పాజిటివ్ రావడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. బర్త్‌డే సందర్భంగా ఐటీ ఉద్యోగి అభిజిత్ బెనర్జీ ఈ ఫామ్‌హౌస్‌ను బుక్ చేశారు. ఫామ్‌హౌస్ నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఫ్రమ్ హోం పేరిట యువకుడికి సైబర్ నేరగాళ్ల టోకరా



హైదరాబాద్ పెన్ పవర్: ఉద్యోగం పేరిట సైబర్ నేరగాళ్లు ఓ యువకుడిని మోసం చేశారు. మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన యువకుడి నుంచి విడతల వారీగా రూ.2 లక్షలు దోచుకున్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ అని ఇన్‌స్టాగ్రామ్‌లో సైబర్ నేరగాళ్లు పోస్టు పెట్టారు. కొంత డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే ఉద్యోగంతో పాటు లాభాలు ఇస్తామని నమ్మించారు. దీంతో ఆకర్షితుడైన యువకుడు మోసగాళ్ల మాటలు నమ్మి విడతల వారీగా రూ.2 లక్షలు చెల్లించాడు. చివరికి అదంతా మోసమని గ్రహించి పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.


## తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో విద్యార్థిని ఆత్మహత్య



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ యూనివర్సిటీ (టీయూ) సౌత్ క్యాంపస్‌లో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్ గదిలో చున్నీతో ఉరివేసుకుని అశ్విని (24) బలవన్మరణానికి పాల్పడింది. టీయూ సౌత్ క్యాంపస్‌లో ఆమె తెలుగులో పీజీ చేస్తోంది. అశ్విని స్వగ్రామం బీర్కూర్ మండలం కిష్టాపూర్. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

## రష్యాలో ప్రకృతి ప్రకోపం... బద్దలైన అగ్నిపర్వతం... మరోసారి భూకంపం

- రష్యాలోని కురిల్ దీవుల్లో భారీ భూకంపం
- రిక్టర్ స్కేల్‌పై 7.0గా నమోదైన తీవ్రత
- పలు ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ
- కమ్చట్కాలో రెండు అగ్నిపర్వతాల విస్ఫోటనం
- 600 ఏళ్ల తర్వాత బద్దలైన క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



రష్యాలో ప్రకృతి ప్రకోపం కొనసాగుతోంది. ఒకవైపు భారీ భూకంపం, మరోవైపు అగ్నిపర్వతాల విస్ఫోటనంతో అట్టుడుకుతోంది. ఆదివారం కురిల్ దీవుల్లో శక్తివంతమైన భూకంపం సంభవించగా, సమీపంలోని కమ్చట్కా ద్వీపకల్పంలో అగ్నిపర్వతాలు లావాను వెదజల్లుతున్నాయి. ఈ వరుస విపత్తులతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, రష్యాలోని కురిల్ దీవుల్లో ఆదివారం భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.0గా నమోదైనట్లు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే (యూఎస్ జీఎస్), జపాన్ వాతావరణ శాఖ ధృవీకరించాయి. భూకంపం ధాటికి భవనాలు తీవ్రంగా కంపించడంతో, ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. దీని తీవ్రత దృష్ట్యా రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ కొన్ని ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలను జారీ చేసింది. ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు.

ఇదిలా ఉండగా, కమ్చట్కా ద్వీపకల్పంలో శనివారం అర్ధరాత్రి అగ్నిపర్వతాలు బద్దలయ్యాయి. దాదాపు 600 సంవత్సరాలుగా నిద్రాణంగా ఉన్న క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం ఒక్కసారిగా విస్ఫోటనం చెందింది. ఈ విస్ఫోటనంతో సుమారు 6,000 మీటర్ల ఎత్తు వరకు బూడిద ఎగసిపడినట్లు రష్యా అధికారులు తెలిపారు. దీనితో పాటు, అత్యంత చురుగ్గా ఉండే క్ల్యూచెవ్స్కీ అగ్నిపర్వతం కూడా బద్దలైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇటీవల ఇదే ప్రాంతంలో 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన నేపథ్యంలో తాజా ప్రకంపనలు చోటుచేసుకోవడం గమనార్హం. గత భూకంపం ప్రభావంతోనే తాజా ప్రకంపనలు సంభవించి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మరిన్ని ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

## 35 కీలక ఔషధాల ధరలు తగ్గించిన కేంద్రం

- సామాన్యులకు భారీ ఊరట.. బీపీ, షుగర్ మందులు ఇకపై చౌక
- నొప్పి నివారణ, యాంటీబయాటిక్ మందులు కూడా చౌక
- కొత్త ధరల జాబితాను దుకాణాల్లో ప్రదర్శించాలని ఆదేశం
- అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలని ప్రభుత్వ హెచ్చరిక
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఊరటనిచ్చే నిర్ణయం



సామాన్యులకు, ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊరట కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 35 రకాల నిత్యావసర మందుల రిటైల్ ధరలను తగ్గిస్తున్నట్లు జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, అధిక రక్తపోటు, నొప్పి నివారణ, యాంటీబయాటిక్ వంటి కీలక ఔషధాల ధరలు గణనీయంగా తగ్గనున్నాయి.

### ఏయే మందుల ధరలు తగ్గాయి?

ధరలు తగ్గించిన జాబితాలో ప్రముఖ ఫార్మా కంపెనీలు తయారుచేసే అనేక ముఖ్యమైన మందులు ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్ మార్కెటింగ్ చేస్తున్న ఏసెక్లోఫెనాక్, పారాసెటమాల్, ట్రిప్సిన్ కైమోట్రిప్సిన్ కాంబినేషన్ టాబ్లెట్ ధరను రూ. 13గా ఎన్‌పీపీఏ నిర్ధారించింది. ఇదే ఫార్ములేషన్‌తో క్యాడిలా ఫార్మాస్యూటికల్స్ విక్రయించే టాబ్లెట్ ధర రూ. 15.01గా నిర్ణయించారు.

గుండె జబ్బులకు వాడే అటోర్వాస్టాటిన్ (40 ఎంజీ), క్లోపిడోగ్రెల్ (75 ఎంజీ) కలిగిన టాబ్లెట్ ధరను రూ. 25.61గా ఖరారు చేశారు. వీటితో పాటు విటమిన్ డి లోపానికి వాడే కోలీకాల్సిఫెరాల్ చుక్కల మందు, చిన్న పిల్లలకు ఇచ్చే సెఫిక్సిమ్, పారాసెటమాల్ ఓరల్ సస్పెన్షన్, నొప్పి నివారణకు ఉపయోగించే డైక్లోఫెనాక్ ఇంజెక్షన్ (ఒక మిల్లీలీటర్‌కు రూ. 31.77) వంటివి కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

### నిబంధనలు తప్పనిసరి

కొత్తగా నిర్ణయించిన ధరల జాబితాను రిటైల్ వ్యాపారులు, డీలర్లు తమ దుకాణాల్లో స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఎన్‌పీపీఏ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వడ్డీతో సహా రాబట్టడంతో పాటు, డ్రగ్స్ (ధరల నియంత్రణ) ఆర్డర్-2013, నిత్యావసర వస్తువుల చట్టం-1955 కింద చర్యలు తీసుకుంటారు. ఈ ధరలకు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అదనంగా ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఔషధ తయారీ కంపెనీలు తమ కొత్త ధరల పట్టికను ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐపీడీఎంఎస్) ద్వారా జారీ చేసి, ఆ సమాచారాన్ని ఎన్‌పీపీఏకి, రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్లకు సమర్పించాలని ఆదేశించారు. ఈ తాజా ఉత్తర్వులతో పాత ధరల ఉత్తర్వులు రద్దయినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# లిల్లీఫుట్ కామెంట్స్ లొల్లి.. బీఆర్ఎస్ నుంచి కవిత ఔట్ ఖాయం?

గులాబీ పార్టీ బీఆర్ఎస్ లో ఇంటి పోరు ముదురుతోంది..! ఆడబిడ్డ కల్వకుంట్ల కవితపై చర్యలు తప్పవని అనిపిస్తోంది. మూడు నెలల కిందట మొదలైన విభేదాలు చినికిచినికి గాలివానగా మారి చివరకు బహిష్కరణ వేటు వేసే వరకు వెళ్లేలా మారాయి. పార్టీ పరిస్థితిపై, బీజేపీతో సంబంధాలపై తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ లీక్ కావడం ఇక్కడివరకు తెచ్చింది. తన తండ్రికి కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇస్తే ఎవరూ మాట్లాడలేదని, పార్టీలో మరో నాయకుడికి ఇస్తే మాత్రం చాలామంది గొంతు విప్పారని కవిత పరోక్షంగా తన అన్న కేటీఆర్‌ను టార్గెట్ చేశారు. తర్వాత పరిస్థితులు కాస్త సద్దుమణిగినా.. ఇటీవల కవిత కీలక పాత్ర పోషించే తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం బాధ్యతలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు అప్పగించారు కేటీఆర్. దీంతోనే కవితపై పార్టీ గుర్రుగా ఉన్నట్లు స్పష్టమైంది.

**నాపై పెద్ద నాయకుడి కుట్ర...**

తాజాగా తనపై పార్టీలో పెద్ద నాయకుడు కుట్ర చేస్తున్నారంటూ కవిత ఆరోపించారు. నల్లగొండ జిల్లాలో పార్టీ ఓటమికి కారణమైన లిల్లీపుట్ నాయకుడు



కూడా తన గురించి మాట్లాడతారా? అసలు కేసీఆర్ లేకుంటే ఆ నాయకుడు ఎక్కడ? అని ప్రశ్నించారు. తండ్రికి రాసిన లేఖను లీక్ చేసింది ఎవరు? అని అసలు విభేదాలకు కారణమైన అంశంపై మరోసారి నోరు విప్పారు.

**వేరు దారి**

కవిత వ్యవహార శైలి చూస్తుంటే ఆమెతో బీఆర్ఎస్ తెగదెంపులు చేసుకోవడం ఖాయమని తెలుస్తోంది. ఇప్పటికే కవిత.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఉద్యమ బాట పడుతున్నారు. తాజాగా నల్లగొండ బీఆర్ఎస్ నాయకుడు లిల్లీపుట్ లీడర్ అని తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యాఖ్యల అనంతరం నల్లగొండకు చెందిన మాజీ మంత్రి, కేసీఆర్ కు అత్యంత నమ్మకస్తుడు అయిన జగదీశ్వర్ రెడ్డి అలర్ట్ అయ్యారు. ఎర్రవల్లి ఫాంహౌస్లో కేసీఆర్ తో భేటీ అయ్యారు.

**ఇక వేటు ఖాయమే...**

కవిత చేసిన తీవ్ర విమర్శల నేపథ్యంలో కేసీఆర్‌తో జగదీశ్‌రెడ్డి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ఇప్పటికే తండ్రి కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ అయ్యారు. అందుకే కవితపై అధిష్టానం చర్యలు తీసుకుంటుందా..? అనే చర్చ జరుగుతోంది. కాగా, ఫామ్‌హౌస్ లో తండ్రితో సమావేశం అనంతరం కేటీఆర్ తెలంగాణ భవన్ కు బయల్దేరారు. అందుకే బీఆర్ఎస్ లో ఏం జరుగుతుందని చర్చ తీవ్రంగా సాగుతోంది.

## గొర్రెల పంపిణీ స్కామ్ లో లేటెస్ట్ అప్ డేట్.. వారి మెడకు చుట్టుకున్నట్లేగా?




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో గొర్రెల పంపిణీ స్కామ్ బీఆర్ఎస్ నేతల మెడకు చుట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే గొర్రెల్ స్కామ్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దీనికి తోడు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు సయితం ఇటీవల తెలంగాణలో ఎనిమిది చోట్ల సోదాలు నిర్వహించారు. మాజీ మంత్రి, నాటి పశువర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాజీ ఓఎస్డీ కల్యాణ్ నివాసంలో సోదాలు నిర్వహించి ఆయనను అదుపులోకి తీసుకుని విచారించారు. అయితే ఈ స్కామ్ లో కేవలం ఓఎస్డీ, అధికారుల ప్రమేయం మాత్రమే ఉండదని బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు...**

ఆ దిశగా ప్రస్తుతం ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారణ చేస్తున్నారు. అయితే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రమేయంపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. దాదాపు వెయ్యి కోట్ల రూపాయల స్కామ్ జరిగిందని ప్రాథమికంగా నిర్ణయించారు. తెలంగాణలో మొదటి విడత మాత్రమే జరిగిన గొర్రెల పంపిణీ పథకం లో డమ్మీ వ్యక్తుల పేరిట అకౌంట్ లో జమ చేశారంటున్నారు. కొనుగోలు చేయాల్సిన సంఖ్యలో గొర్రెలను చేయకుండా, ఎక్కువగా చేసిననట్లు చూపించడమే కాకుండా గొర్రెలను పంపిణీ చేసినట్లు అధికారులు లెక్కల్లో చూపించారు. దీనిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసు అధారంగా ఈడీ అధికారులు రంగంలోకి దిగారు.

**వెయ్యి కోట్ల స్కామ్ అని...**

పలువురు ఉన్నతాధికారులను కూడా అరెస్ట్ చేశారు. అయితే ఈ గొర్రెల పంపిణీ స్కామ్ లో అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల ప్రమేయం ఎంత మేరకు ఉందన్న దానిపై త్వరలోనే ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారణకు సిద్ధమయ్యారు. ఒక్కొక్క యూనిట్ కు ఇరవై గొర్రెలు పంపిణీ చేస్తామని చెప్పి ఈ పథకాన్ని ప్రారంభించారు. ఒక్కొక్క యూనిట్ మొత్తం వ్యయం 1.75 లక్షలు కాగా, ఇందులో నలభై ఐదు వేల రూపాయలు లబ్దిదారుడు చెల్లిం

చాల్సి ఉంటుంది. మాంసం ఉత్పత్తి పెంచడానికి ఈ గొర్రెల పంపిణీ ఉపయోగపడుతుందని భావించిన ప్రభుత్వం పథకం అమలులో అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా అవినీతికి పాల్పడ్డారని ఈడీ అధికారులు కూడా ధృవీకరించారు. దీంతో ఈడీ అధికారులు త్వరలోనే మాజీ మంత్రులను కూడా విచారణకు పిలిచే అవకాశముంది.

## కవిత వెనుక 'జీరో' క్యాడర్!

**హైదరాబాద్ పెన్ పవర్:**కల్వకుంట్ల కవిత.. బీఆర్ఎస్ కు దూరంగా.. జాగృతిపేరుతో సొంతంగా ఎదుగడానికి అడుగులు వేస్తోంది. తండ్రి, సోదరుడికి దూరంగా బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా అడుగులువేస్తోంది. బీఆర్ఎస్ పార్టీ ఓటమి తర్వాత తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీస్తోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత రాజకీయ వైఖరి అందరినీ షాక్ కు గురిచేస్తోంది.. కష్టాల్లో ఉన్న పార్టీకి పునర్నిర్మాణం అవసరమైన ఈ సమయంలో, కవిత తీరుపై పార్టీ అంతర్గతంగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆమె వెంట పార్టీ శ్రేణులు లేకపోవడం, కేడర్‌లోనూ వ్యతిరేకత పెరిగిపోతుండటం ఈ చర్చకు ప్రధాన కారణం.

**ప్రత్యర్థులకు ఊతం ఇస్తున్నారా?**

బీఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉంది. ఈ సమయంలో పార్టీ శక్తివంతంగా పోరాడి, ప్రజల సమస్యల కోసం గొంతెత్తాలి. కానీ కవిత వ్యవహార శైలి మాత్రం ప్రత్యర్థులకు మద్దతుగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సొంత తండ్రి కేసీఆర్, అన్న కేటీఆర్‌లకు వ్యతిరేకంగా పరోక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు పార్టీ శ్రేణుల్లో అయోమయానికి దారితీస్తున్నాయి. ఇది పార్టీ పురోగతిని అడ్డుకుంటుందని పార్టీలోని కొందరు అభిప్రాయపడుతున్నారు.

**పార్టీకి దూరమవుతున్న కవిత?**

ప్రస్తుతం కవిత వెంట బీఆర్ఎస్ నేతలు, ముఖ్యంగా మధ్యస్థాయి కేడర్, నిలబడటం లేదు. ఒంటరిగా వెళుతున్న ఆమెతో కలిసి పనిచేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని స్పష్టమవుతోంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణం ఆమె ఇటీవల వ్యవహరిస్తున్న తీరేనని పార్టీలో చర్చ జరుగుతోంది. ఇటీవల ఆమె రాసిన 'ఓపెన్ లెటర్' కూడా రాజకీయంగా పెద్దగా స్పందన పొందలేదు. ఈ లేఖ ద్వారా ప్రజల్లో తనకు మద్దతు ఉందనే ప్రచారం జరిగినా, వాస్తవానికి బీఆర్ఎస్‌లో ఆమెకు మద్దతు లేదనేది తేటతెల్లమవుతోంది.

**షర్మిల తరహాలో...**

దివంగత నేత వైఎస్ఆర్ కుటుంబంలో షర్మిల పరిస్థితిని గుర్తు చేస్తూ, ఇప్పుడు కవితను కూడా అదే కోణంలో చూస్తున్నారు. వైఎస్ఆర్ మరణం తర్వాత షర్మిల తన సొంత రాజకీయ మార్గాన్ని ఎంచుకున్నట్లే, కవిత కూడా బీఆర్ఎస్ నుంచి బయటికి వెళ్లి తన సొంత మార్గాన్ని ఎంచుకోవచ్చని కొందరు భావిస్తున్నారు. అయితే, కష్టకాలంలో రాజకీయ చతురత చూపకుండా, కేవలం మీడియాలో కనిపించడం కోసం లేఖలు రాయడం, గిల్లికజ్జాలు పెట్టుకోవడం వంటివి ప్రజల్లో సానుకూలతను పెంచడం లేదని విశ్లేషకులు చెబుతున్నారు.

**కవిత రాజకీయ భవిష్యత్తు**

ఈ నేపథ్యంలో, కవిత రాజకీయ భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆమె బీఆర్ఎస్ పునర్నిర్మాణంలో భాగం కాకపోతే, సొంత రాజకీయ దారి ఎంచుకుంటారా? లేక ఇది పార్టీకి మరింత నష్టాన్ని కలిగిస్తుందా? అనే అంశంపై చర్చ జరుగుతోంది.

పార్టీకి ప్రజా మద్దతు లభించాలంటే, కేవలం మాటలు చెప్పడం కాకుండా, క్షేత్ర స్థాయిలో కష్టపడి పనిచేయడం అవసరం. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో నాయకత్వ పునర్నిర్మాణం అవసరం. అందులో భాగం కావాలంటే కవిత తన వైఖరిని మార్చుకోవాలని, లేదంటే ఆమె వెంట 'జీరో క్యాడర్' అనే పరిస్థితి మాత్రమే మిగిలిపోతుందని..ఆమె ఒంటరిగా మారి.. రెంటికి చెడ్డ రేవడిలా మారుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# బంగారం ధరలు తగ్గుతాయని అనుకుంటున్నారా? ఈరోజు ధరలు ఎంతంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:**బంగారం ధరలు మరింత పెరిగే అవకాశముందన్న మార్కెట్ నిపుణులు చేస్తున్న హెచ్చరికలు నిజమయ్యేట్లే కనిపిస్తున్నాయి. గత నాలుగు రోజుల నుంచి ధరలు తగ్గుతుండటంతో ఇంకా ధరలు తగ్గుతాయని వినియోగదారులు వెయిట్ చేస్తున్నారు. తగ్గినప్పుడు బంగారం, వెండి ఆభరణాలను కొనుగోలు చేయవచ్చని భావిస్తున్నారు. అధిక ధరలు వెచ్చించి బంగారం కొనుగోలు చేయడం అనవసరమని ఆలోచించి కొనుగోలు నిర్ణయాన్ని వెనక్కు తగ్గుతున్నారు. అయితే బంగారం ధరలు నిజంగా తగ్గుతాయా? బంగారం ధరలు పెరగడానికి గల కారణాలేంటి? సీజన్ తో సంబంధం లేకుండా బంగారం ధరలు పెరగడానికి ఏఏ అంశాలు దోహదం చేస్తున్నాయన్నది అందరికీ తెలిసిందే.




**తగ్గుతాయని...**

బంగారం అంటే అందరికీ ఇష్టమే. అందులోనూ మహిళలకు ముఖ్యంగా బంగారం వస్తువు కనిపించిందంటే పూనకాలు వస్తాయి. తమకు నచ్చిన ఆభరణం దొరికితే కొనుగోలు చేసేంత వరకూ ఎవరూ ఊరుకోరు. కానీ ఇప్పటికే బంగారం ధరలు లక్ష రూపాయలు దాటేశాయి. వెండి ధరలు కూడా అంతే స్థాయిలో భయపెడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో బంగారం ధరలు కొంత తగ్గుతాయేమోనని కొందరు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఇంకా తగ్గుతాయేమోనని ఆశతో చూస్తున్న వారికి ఆశాభంగం తప్పేట్లు లేదు. బంగారం ధరలు మరోసారి భారీగా పెరిగి కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి షాకిచ్చాయి. అందులోనూ శ్రావణమాసం కావడంతో మరింత ధరలు పెరిగే అవకాశముంది.

**భారీగా పెరిగి...**

పెళ్లిళ్లు, శుభకార్యాలు జోరుగా జరుగుతుండటంతో బంగారం, వెండి ఆభరణాల కొనుగోళ్లు కూడా ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో ధరలు తగ్గే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు. ఈరోజు దేశంలో బంగారం

ధరలు భారీగా పెరిగాయి. వెండి ధర మాత్రం స్వల్పంగా పెరిగింది. పది గ్రాముల బంగారం ధరపై 1,540 రూపాయలు పెరిగింది. కిలో వెండి ధరపై వంద రూపాయలు పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో ఉదయం ఆరు గంటలకు నమోదయిన బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 92,290 రూపాయలుగా ఉంది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,01,350 రూపాయలుగా నమోదయింది. కిలో వెండి ధర 1,13,100 రూపాయలుగా ట్రేడ్ అవుతుంది.

# ఏడాదిలో దాదాపు 23 వేల కోట్లు కొట్టేశారు.. సైబర్ నేరస్థుల చేతివాటం

ఈ ఏడాది భారతీయులు రూ.1.2 లక్షల కోట్లు కోల్పోనున్నారని అంచనా

రోజురోజుకూ తెలివిమీరుతున్న సైబర్ నేరస్థులు

సోషల్ మీడియా వేదికల ద్వారా మోసాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలో ఏటేటా సైబర్ నేరాలు పెరిగిపోతున్నా యని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ స్కామ్‌ల బారిన పడి చాలామంది తమ కష్టార్జితాన్ని కోల్పోతున్నారని చెబుతున్నారు. ఒక్క 2024 లోనే సైబర్ నేరగాళ్లు భారతీయుల నుంచి రూ.22,842 కోట్లు కొట్టేశారని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నివేదిక వెల్లడించింది. ఆన్ లైన్ మోసాలకు ఈ ఏడాది భారతీయులు దాదాపు రూ.1.2 లక్షల కోట్లు కోల్పోనున్నారని ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ అంచనా వేసింది.డాటా లీడ్స్ సంస్థ నివేదిక ప్రకారం.. 2023లో ఆన్ లైన్ మోసాల బారిన పడి భారతీయులు రూ.7,465 కోట్లు కోల్పోయారు. 2022లో ఇలా కోల్పోయిన మొత్తం రూ.2,306 కోట్లు. సైబర్ మోసానికి గురయ్యామంటూ 2024లో పోలీసులను ఆశ్రయించిన వారి సంఖ్య దాదాపుగా 20 లక్షలు కాగా ఫిర్యాదు చేయని వారిని కూడా కలిపితే ఈ సంఖ్య మరింత ఎక్కువే ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఏటేటా పెరిగిపోతున్న ఆన్ లైన్ మోసాలను చూస్తుంటే సైబర్ నేరస్థులు తెలివిమీరుతున్నారని తెలుస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఒక మోసం విస్తృతంగా వ్యాపించి జనాలకు దానిపై అవగాహన పెరిగిందని గుర్తించిన వెంటనే కొత్తరకం మోసాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని చెబుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని




ఉపయోగించుకుంటూ కొత్త కొత్త పద్ధతులలో మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. యూపీఐ పేమెంట్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత మూడేళ్లలోనే సైబర్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. మెసేజ్ ల రూపంలో, వాట్సాప్ సందేశాల రూపంలో లింక్ లు పంపి బ్యాంకు ఖాతాలోని సొమ్మంతా ఊడ్చేయడం ఒక పద్ధతి కాగా, ఈ కామర్స్ వేదికల ఫేక్ సైట్లను సృష్టించి డబ్బులు కొట్టేయడం మరో పద్ధతి.

ఆన్ లైన్ వేదికలపై ఆకర్షణీయమైన ప్రకటనలు గుప్పించి బోల్తా కొట్టించడంలో సైబర్ నేరస్థులు ఆరితేరారని నిపుణులు చెబుతున్నారు. ఖరీదైన వస్తువులను తక్కువ ధరకే అమ్ముతామంటూ ప్రలోభపెట్టి అందినకాడికి దోచేసి ఫోన్ స్విచ్చాఫ్ చేస్తుండడం సాధారణంగా మారిందని వివరించారు. గతేడాది తొలి మూడు నెలల కాలంలో వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా సైబర్ నేరస్థులు వేలాదిమందిని ముంచేశారని ఓ నివేదిక వెల్లడించింది.

# తెల్ల టమాటాలతో ఎన్ని లాభాలో!

చర్మ సౌందర్యంలో కొత్తగా తెల్ల టమాటా సారం

రంగులేని కెరోటినాయిడ్లతో ప్రత్యేక ప్రయోజనాలు

చర్మంపై మచ్చలు, నల్లటి వలయాలకు చెక్

సూర్యకిరణాల నుంచి సహజమైన రక్షణ

వృద్ధాప్య ఛాయలను దూరం చేసే యాంటీఆక్సిడెంట్లు

సున్నితమైన చర్మానికి కూడా ఎంతో అనుకూలం

**హైదరాబాద్ పెన్ పవర్:**సౌందర్య సంరక్షణ ప్రపంచంలో ఎప్పటికప్పుడు కొత్త పోకడలు వస్తూనే ఉంటాయి. ఇప్పటివరకు మనం ఎర్ర టమాటాల ప్రయోజనాల గురించి విన్నాం. కానీ, ప్రస్తుతం బ్యూటీ రంగంలో "తెల్ల టమాటా" హాట్ టాపిక్‌గా మారింది. చర్మానికి సహజమైన మెరుపును అందించడంలో, యవ్వనంగా ఉంచడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు.




**ఏమిటీ తెల్ల టమాటా ప్రత్యేకత?**

సాధారణంగా ఎర్రగా ఉండే టమాటాలకు భిన్నంగా, ఈ తెల్ల టమాటాలలో ఫైటోయిన్, ఫైటోఫ్లూయిన్ అనే ప్రత్యేకమైన రంగులేని కెరోటినాయిడ్లు ఉంటాయి. ఎర్ర టమాటాలలో ఉండే లైకోపీన్ లా కాకుండా, ఈ సమ్మేళనాలు చర్మాన్ని కాంతివంతం చేయడంపై ప్రధానంగా దృష్టి సారిస్తాయి. అందుకే సౌందర్య ఉత్పత్తుల తయారీలో దీని వాడకం బాగా పెరిగింది.

**చర్మానికి కలిగే ముఖ్య ప్రయోజనాలు**

ప్రధానంగా, తెల్ల టమాటా సారం చర్మాన్ని కాంతివంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖంపై ఉండే నల్లటి మచ్చలు, మొటిమల తాలూకు గుర్తులు, కళ్ల కింద నల్లటి వలయాలను తగ్గించి చర్మానికి సహజమైన నిగారింపును అందిస్తుంది. అంతేకాకుండా, ఇది సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత (యూవీ) కిరణాల నుంచి చర్మానికి ఒక కవచంలా పనిచేసి, చర్మ కణాలను దెబ్బతినకుండా కాపాడుతుంది.

ఇందులోని శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటం ద్వారా వృద్ధాప్య ఛాయలను దరిచేరనీయవు. చర్మంపై ముడతలు రాకుండా నివారించి, యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. అన్నింటికన్నా ముఖ్యంగా, ఇది సున్నితమైన చర్మతత్వం ఉన్నవారికి కూడా ఎలాంటి అలర్జీ కలిగించకుండా పనిచేయడం దీని ప్రత్యేకత అని నిపుణులు వివరిస్తున్నారు.ప్రస్తుతం మార్కెట్లో లభించే అనేక సీరమ్‌లు, మాయిశ్చరైజర్లు, ఇతర సౌందర్య ఉత్పత్తులలో ఈ తెల్ల టమాటా సారాన్ని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. మీ చర్మ సంరక్షణలో దీన్ని భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన, ప్రకాశవంతమైన చర్మాన్ని సొంతం చేసుకోవచ్చని సూచిస్తున్నారు.

# : టికెట్ లేకుండా ప్రయాణించి రచ్చ చేసిన ప్రయాణికుడు.. బొరివలి స్టేషన్‌లో విధ్వంసం..

**హైదరాబాద్ పెన్ పవర్:**ముంబైలోని బొరివలి రైల్వే స్టేషన్‌లో నిన్న మధ్యాహ్నం ఒక అనూహ్య ఘటన జరిగింది. టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి, రైల్వే అధికారులతో వాగ్వాదానికి దిగడమే కాకుండా ఏకంగా టికెట్ చెకింగ్ కార్యాలయాన్ని ధ్వంసం చేశాడు. ఈ విధ్వంసం వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ఘటనపై తీవ్ర చర్చ మొదలైంది. విరార్ లోకల్ రైలులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను రైల్వే టికెట్ చెకర్లు గుర్తించారు. వారిలో ఒక వ్యక్తికి టికెట్ లేకపోవడంతో వారిని బొరివలి స్టేషన్‌లో దింపి టీసీ కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడే అసలు గొడవ మొదలైంది. రైల్వే నిబంధనలను పాటించకుండా, టికెట్ లేకుండా ప్రయాణించినందుకు అధికారులు ప్రశ్నించగా ఆ వ్యక్తి ఆగ్రహంతో ఊగిపోయాడు. సిబ్బందిపై దాడి చేయడమే కాకుండా కార్యాలయంలోని కంప్యూటర్లు, మానిటర్లు, కీబోర్డులు వంటి వాటిని ధ్వంసం చేశాడు. ఈ ఘర్షణలో టికెట్ ఇన్‌స్పెక్టర్ షంషేర్ ఇబ్రహీం సహా పలువురు సిబ్బందికి గాయాలయ్యాయి.

సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలో పసుపు రంగు కుర్తా ధరించిన ఆ వ్యక్తి అధికారులపై అరుస్తూ, కార్యాలయంలోని వస్తువులను విసిరేయడం స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాకుండా

"ధారావిలో నా పేరు చెప్పు, అందరికీ తెలుసు" అంటూ అధికారులను బెదిరించాడు. ఆందోళనలో ఉన్న ఒక మహిళను ఓదారుస్తూనే, తన వీరంగం కొనసాగించాడు.

ఈ ఘటన తర్వాత రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) నిందితులను అదుపులోకి తీసుకుని, గవర్నమెంట్ రైల్వే పోలీసులకు (జీఆర్పీ) అప్పగించింది. ప్రభుత్వ ఉద్యోగిపై దాడి, ప్రభుత్వ ఆస్తి నష్టం వంటి తీవ్ర సెక్షన్ల కింద కేసు నమోదైంది.



## మహారాష్ట్రలో మరోమారు రెచ్చిపోయిన రాజ్‌థాకరే మద్దతుదారులు.. డ్యాన్స్ బార్ ధ్వంసం



**హైదరాబాద్ పెన్ పవర్:**మహారాష్ట్రలో రాజ్‌థాకరే మద్దతుదారులు మరోమారు రెచ్చిపోయారు. ముంబై సమీపంలోని పన్వేల్‌లో గత రాత్రి డ్యాన్స్‌బార్‌పై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. రాయ్‌గడ్ జిల్లాలో డ్యాన్స్‌బార్లపై మహారాష్ట్ర నవ నిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) చీఫ్ రాజ్‌థాకరే చేసిన వ్యాఖ్యల అనంతరం ఈ ఘటన చోటుచేసుకుంది. డజను మందికిపైగా వ్యక్తులు కర్రలతో నైట్ రైడర్స్ బార్‌పై దాడిచేసి, ధ్వంసం చేశారు. లోపలికి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించారు. ఫర్నిచర్‌తోపాటు మద్యం బాటిళ్లపై ప్రతాపం చూపించారు. బార్‌లోని టేబుళ్లు, అద్దాలు పగిలిపోయినట్టు ఉన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరాఠీ ఆత్మగౌరవం పేరుతో పదేపదే హింసకు మద్దతిస్తున్న రాజ్‌థాకరే నిన్న పన్వేల్‌లో జరిగిన కిసాన్ మజ్దూర్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ శివాజీ మహరాజ్ రాజధాని అయిన రాయ్‌గడ్‌లో డ్యాన్స్ బార్లు ఉండటానికి వీల్లేదని అన్నారు. ఆయన వ్యాఖ్యలతో ఎంఎన్‌ఎస్ కార్యకర్తలు చెలరేగిపోయారు. అర్ధరాత్రి డ్యాన్స్‌బార్‌కు చేరుకుని విధ్వంసం సృష్టించారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని, తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. అయితే, ఈ ఘటనను ఎంఎన్‌ఎస్ నేత సందీప్ దేశ్‌పాండే సమర్థించుకున్నారు. దీనిని ఆయన 'ప్రతీకాత్మక నిరసన' (సింబాలిక్ ప్రొటెస్ట్)గా అభివర్ణించారు. బార్లు ఉండటం చట్ట విరుద్ధమని, అందుకనే వారు ఆ పని చేశారని చెప్పారు. ప్రభుత్వం వీటిపై దృష్టిసారించాలని సూచించారు. కాగా, రాజ్‌థాకరే మద్దతుదారులు ఇటీవల మరాఠీయేతరులపైనా దాడికి పాల్పడ్డారు.

## అతి త్వరలో భారత్ లో బుల్లెట్ రైలు... 2 గంటల్లోనే ముంబై నుంచి అహ్మదాబాద్ కు!

- ముంబై-అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలు సేవలు అతి త్వరలో ప్రారంభం
- కేవలం 2 గంటల 7 నిమిషాలకు తగ్గనున్న ప్రయాణ సమయం
- గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్న రైలు
- వేగంగా సాగుతున్న 508 కిలోమీటర్ల హై-స్పీడ్ రైల్ కారిడార్ పనులు




**హైదరాబాద్ పెన్ పవర్:**దేశ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌పై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. ముంబై-అహ్మదాబాద్ మధ్య దేశంలోని మొట్టమొదటి బుల్లెట్ రైలు సేవలను అతి త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే, ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం కేవలం 2 గంటల 7 నిమిషాలకు తగ్గిపోతుందని తెలిపారు.

ఆయన అయోధ్య ఎక్స్‌ప్రెస్, రేవా-పుణె ఎక్స్‌ప్రెస్, జబల్‌పూర్-రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ రైలు గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని పేర్కొన్నారు. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ నుంచి గుజరాత్‌లోని వాపి, సూరత్, వడోదర, అహ్మదాబాద్ వంటి ప్రధాన నగరాలను కలుపుతూ 508 కిలోమీటర్ల పొడవైన హై-స్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణం జరుగుతోందని ఆయన తెలిపారు. గుజరాత్‌లో చేపట్టనున్న మరిన్ని రైల్వే ప్రాజెక్టుల గురించి కూడా అశ్విని వైష్ణవ్ ప్రస్తావించారు. పోర్‌బందర్-రాజ్‌కోట్ మధ్య కొత్త రైలు, రణవావ్ స్టేషన్‌లో రూ.135 కోట్లతో కోచ్ మెయింటెనెన్స్ కేంద్రం, పోర్‌బందర్‌లో రైల్వే ఫ్లైఓవర్, రెండు గతి శక్తి కార్గో టెర్మినళ్లు వంటివి రానున్నాయని వెల్లడించారు. గత 11 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా 34,000 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాకులు వేశామని,


ఇది రోజుకు సగటున 12 కిలోమీటర్లతో సమానమని ఆయన గుర్తుచేశారు. రైళ్ల రాకపోకలను నిలిపివేయకుండానే 1,300 రైల్వే స్టేషన్లను ఆధునీకరించడం భారత రైల్వే చరిత్రలో అపూర్వమైన ఘట్టమని కొనియాడారు. వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ వంటి ఆధునిక రైళ్లను ప్రవేశపెట్టామని, తక్కువ ధర టిక్కెట్లతో అత్యాధునిక సౌకర్యాలున్న 8 అమృత్ భారత్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని ఆయన అన్నారు. గుజరాత్‌తో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కూడా డబుల్ ఇంజన్ ప్రభుత్వాల సహకారంతో రైల్వే ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని అశ్విని వైష్ణవ్ వివరించారు.

## ఆలయానికి బయల్దేరి కారు ప్రమాదంలో

# నలుగురు వృద్ధులు దుర్మరణం

**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాలో భారత సంతతికి చెందిన నలుగురు వృద్ధులు మరణించారు. వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురవడంతో నలుగురూ అక్కడికక్కడే చనిపోయారని పోలీసులు తెలిపారు. మృతులు.. ఆశా దివాన్, కిశోర్ దివాన్, శైలేష్ దివాన్, గీతా దివాన్.. నలుగురూ 80 ఏళ్లు పైబడిన వృద్ధులేనని పోలీసులు వివరించారు. ఈ వారం మొదట్లో నలుగురూ ప్రభుపాద ఆలయానికి కారులో బయలుదేరారని కుటుంబ సభ్యులు తెలిపారు.మధ్యలో ఓ రెస్టారెంట్ వద్ద ఆగి లంచ్ చేశారని, ఆ తర్వాత వారి జాడ తెలియరాలేదని పేర్కొన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వెంటనే అప్రమత్తమైన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే





వృద్ధులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైందని, కారులోని నలుగురూ అక్కడికక్కడే చనిపోయారని గుర్తించారు. ప్రాథమిక పరిశీల నలో బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. కాగా, ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఏటీఎంలలో రూ. 500 నోట్లు బంద్? వైరల్ మెసేజ్‌పై కేంద్రం క్లారిటీ



- ఏటీఎంలలో రూ. 500 నోట్ల పంపిణీ నిలిపివేతపై ఫేక్ న్యూస్
- ఆర్‌బీఐ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని కేంద్రం స్పష్టీకరణ
- రూ. 500 నోట్లు యథావిధిగా చెల్లుబాటు అవుతాయని వెల్లడి
- ఇలాంటి వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచన
- గతంలోనూ ఇలాంటి ప్రచారాన్ని ఖండించిన ప్రభుత్వం

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏటీఎంల ద్వారా 500 రూపాయల నోట్ల జారీని నిలిపివేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు జారీ చేసిందంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమవుతున్న సందేశం పూర్తిగా అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్‌బీఐ అలాంటి ఆదేశాలేవీ ఇవ్వలేదని, ప్రజలు ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని హెచ్చరించింది.

**వైరల్ మెసేజ్‌లో ఏముంది?**

2025 సెప్టెంబర్ 30 నాటికి ఏటీఎంల నుంచి రూ. 500 నోట్ల జారీని నిలిపివేయాలని ఆర్‌బీఐ బ్యాంకులను ఆదేశించిందని ఓ సందేశం వాట్సాప్‌లో చక్కర్లు కొడుతోంది. 2026 మార్చి 31 నాటికి 90 శాతం, సెప్టెంబర్ 30 నాటికి 75 శాతం ఏటీఎంలలో ఈ నోట్ల పంపిణీ ఆగిపోతుందని ఆ సందేశంలో పేర్కొన్నారు. ప్రజలు తమ వద్ద ఉన్న రూ. 500 నోట్లను మార్చుకోవాలని, భవిష్యత్తులో ఏటీఎంలలో కేవలం రూ. 100, రూ. 200 నోట్లు మాత్రమే అందుబాటులో ఉంటాయని కూడా అందులో ఉంది.

**ప్రభుత్వం ఏం చెప్పింది?**

ఈ వైరల్ సందేశంపై ప్రభుత్వ అధికారిక మీడియా సంస్థ అయిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. ఆర్‌బీఐ అలాంటి సూచనలేవీ చేయలేదని, రూ. 500 నోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. "సెప్టెంబర్ 2025 నాటికి ఏటీఎంల నుంచి రూ. 500 నోట్ల పంపిణీని నిలిపివేయాలని ఆర్‌బీఐ బ్యాంకులను కోరిందా? ఈ మేరకు వాట్సాప్‌లో వ్యాపిస్తున్న సందేశం పూర్తిగా అవాస్తవం. ఆర్‌బీఐ నుంచి అలాంటి ఆదేశాలు జారీ కాలేదు. రూ. 500 నోట్లు చెల్లుబాటులోనే కొనసాగుతాయి" అని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తన పోస్టులో పేర్కొంది.

గత నెలలో కూడా ఇలాంటి వదంతే సోషల్ మీడియాలో వైరల్ అయిందని, అప్పుడు కూడా దానిని ఖండించామని అధికారులు గుర్తుచేశారు. కరెన్సీకి సంబంధించిన ఏ సమాచారాన్నైనా నమ్మే ముందు ఆర్‌బీఐ లేదా పీఐబీ వంటి అధికారిక వర్గాల ద్వారా నిర్ధారించుకోవాలని, ఇలాంటి మోసపూరిత సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

## నదిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని బోటులో వెళ్లి కాపాడిన స్థానికులు..



**హైదరాబాద్ పెన్ పవర్:**నదిలో ఈతకు దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తూ నీటిలో కొట్టుకుపోతుండగా స్థానికులు స్పందించి రక్షించారు. బోటులో వెళ్లి ఒడ్డుకు తీసుకొచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం పాతాళ గంగ వద్ద చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వారాంతం కావడంతో హైదరాబాద్ కు చెందిన నలుగురు మిత్రులు విహారయాత్రకు వచ్చారు. పాతళ గంగ వద్ద కృష్ణానదిలో దిగి సరదాగా ఈదులాడారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి నది లోపలికి వెళ్లడంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ఇది చూసి మిగిలిన ముగ్గురు మిత్రులు కాపాడాలని కేకలు పెట్టగా సందర్శకులను బోటుపై తిప్పే స్థానికులు స్పందించారు. బోటుతో వెళ్లి నదిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడారు.

## సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్ చెబుతుంటే మంత్రముగ్ధులం అయిపోతాం: అల్లు అరవింద్

- మహావతార్ నరసింహ చిత్రం సక్సెస్ మీట్ లో అల్లు అరవింద్ వ్యాఖ్యలు
- సనాతన ధర్మంపై పవన్ కల్యాణ్ కు అపారమైన జ్ఞానం ఉందని వెల్లడి
- ఆయన మహావతార్ నరసింహ చిత్రాన్ని చూడాలని విజ్ఞప్తి



**హైదరాబాద్ పెన్ పవర్:**మహావతార్ నరసింహ చిత్రం సక్సెస్ మీట్ లో ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఏపీ డిప్యూటీ సీఎం, టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్ మాట్లాడుతుంటే ఎవరైనా మంత్రముగ్ధులు అయిపోవాల్సిందేనని అన్నారు. సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్ కు అపారమైన అవగాహన ఉందని తెలిపారు. తనకు తెలిసిన వాళ్లలో గానీ, తమ కుటుంబ సభ్యుల్లో గానీ... పవన్ కు తెలిసినంతగా సనాతన ధర్మం గురించి తెలిసిన వాళ్లు ఇంకెవరూ లేరని కొనియాడారు. పవన్ కల్యాణ్ 'మహావతార్ నరసింహ' చిత్రం చూడాలని, ఈ సినిమా గురించి మాట్లాడాలని కోరుకుంటున్నానని అల్లు అరవింద్ తెలిపారు. కాగా, ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజైన 'మహావతార్ నరసింహ' 4 రోజుల్లోనే రూ.79 కోట్లు రాబట్టడం విశేషం. కన్నడ చిత్రనిర్మాణ సంస్థ హొంబలే ఫిల్మ్స్ బ్యానర్ పై వచ్చిన ఈ చిత్రాన్ని తెలుగులో అల్లు అరవింద్ కు చెందిన గీతా ఆర్ట్స్ విడుదల చేసింది.

# రేవంత్, పొంగులేటి, కేవీపీ ఇళ్లన్నీ చెరువుల్లోనే : కేటీఆర్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల తూటాలు పేలాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధికార పార్టీ నేతలపై, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావులపై తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ పేరుతో జరుగుతున్న ఏకపక్ష చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ నిబంధనల అమలులో వివక్ష చూపుతోందని కేటీఆర్ ఆరోపించారు. పేదలు చెరువుల చుట్టూ ఇళ్లు నిర్మించుకుంటే, హైడ్రా వెంటనే చర్యలు తీసుకుంటుందని, కానీ అధికార పార్టీ నేతలు, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి, మంత్రి పొంగులేటి, కేవీపీ రామచంద్రరావు చెరువులను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నా హైడ్రా మౌనంగా ఉందని ఆయన మండిపడ్డారు. "చట్టం అందరికీ సమానమా? లేక పేదలకే తప్పా?" అని కేటీఆర్ నిలదీశారు. కేటీఆర్ విమర్శలు కేవలం హైడ్రాకు మాత్రమే పరిమితం



కాలేదు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో మత, ప్రాంతీయ వివక్ష లేకుండా అభివృద్ధి జరిగిందని, కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మధ్య కలహాలు సృష్టిస్తోందని ఆరోపించారు. "ఇది మొదటి సంవత్సరం మాత్రమే... ఇప్పటికే విద్వేష రాజకీయాలు ఊపందుకున్నాయి. ఇది కొనసాగితే పరిస్థితులు మరింత దిగజారుతాయి" అని హెచ్చరించారు. రాబోయే ఎన్నికలపై కూడా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా దక్కదని, ప్రజలు వారి కుతంత్రాలను గ్రహించారని, మళ్లీ బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ చేసిన ఈ సంచలన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. అధికార కాంగ్రెస్ దీనిపై ఎలా స్పందించనుందో వేచి చూడాలి. ఈ వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారి తీయవచ్చని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల్లో నిబంధనలు, న్యాయం అమలులో ఉన్న వివక్షపై మరింత అవగాహన పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# టీడీపీతో అసలు కుదరంటున్న బీజేపీ !

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగుదేశం పార్టీతో బీజేపీ పొత్తుకు నో చెబుతోంది. ఎక్కడా ఏమిటీ అంటేనే మ్యాటర్ పొలిటికల్ గా వేరే అని అర్థం చేసుకోవాలి. ఏపీలో చూస్తే టీడీపీ పెద్దన్నగా ఉంది. బీజేపీ జనసేన వచ్చి చేరాయి. మూడు పార్టీలు కలసి కూటమి కట్టాయి. దాంతో బ్రహ్మాండమైన మెజారిటీ వచ్చింది. దివ్యంగా ప్రభుత్వం ఏర్పాడింది. కలసి ఉంటే కలదు సుఖం అనుకుంటూ ముందుకు సాగుతున్నాయి మిత్రపక్షాలు. కానీ తెలంగాణాలో మాత్రం సీన్ రివర్స్ గా ఉంది.



**తెలంగాణాలో మాత్రం ఎందుకో :**

తెలంగాణాలో బీజేపీ ఇపుడు రాజకీయంగా అవకాశాలు పెంచుకోవాలని చూస్తోంది. ఒక వైపు అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉంది. ఆ పార్టీకి చరిష్మాటిక్ లీడర్ రేవంత్ రెడ్డి సీఎం గా ఉన్నారు ఇక బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉంది పదేళ్ళ పాటు తెలంగాణాను ఏలిన పార్టీగా బీఆర్ఎస్ ఉంది. పైగా కేసీఆర్ ఉద్యమకారుడిగా ఉన్నారు. తెలంగాణ మలి విడత పోరాటాన్ని విజయం వైపుగా నడిపిన క్రెడిట్ ని ఆయన ఖాతాలో వేసుకున్నారు అలా బీఅర్ఎస్ కి ఇంధనం ఇమేజ్ అన్నీ కేసీఆర్ అని వేరేగా చెప్పాల్సింది లేదు. ఈ మధ్యలో బీజేపీ ఉంది. బీజేపీ జాతీయ స్థాయిలో బలంగా ఉన్నా తెలంగాణాలో మాత్రం ఎందుకో ఎత్తిగిల్లలేకపోతోంది. పార్టీలో ఎక్కువ మంది నాయకులు ఉండడం కూడా బీజేపీకి ఇబ్బందిగానే ఉన్నట్లుంది దాంతో అందరినీ కలుపుకుని పోయే విధంగా బీజేపీ దృఢమైన నాయకత్వంతోనే ముందుకు సాగాల్సి ఉంది.

**పొత్తుకు బీజేపీ నో :**

ఇక బీజేపీకి పట్టణ ప్రాంతాలలో బలం ఉంది. రూరల్ బేస్ లో కమలానికి ఆదరణ తక్కువ అన్నది కూడా ఒక విశ్లేషణ గా ఉంది. టీడీపీ తెలంగాణాలో ఈ రోజుకీ కొన్ని ప్యాకెట్స్ లో కొంత ప్రభావం చూపించే స్థితిలో ఉంది. అలా బీజేపీ టీడీపీ జనసేనలకు కలుపుకుని ఎన్డీయే కూటమిగా ముందుకు సాగితే అధికారం దక్కుతుంది అన్న లెక్కలు ఉన్నాయి. అయితే ఈ రకమైన రాజకీయ సమీకరణ వల్ల తెలంగాణా వాదం ముందుకు వచ్చి అసలుకే ఎసరు వస్తుందని కూడా ఆలోచిస్తున్నారు. దాంతో టీడీపీతో పొత్తులు నో అని బీజేపీ చెబుతోంది.

**ఒంటరిగానేనని క్లారిటీ :**

తెలంగాణాలో టీడీపీతో కానీ జనసేనతో కానీ పొత్తులకు ఆస్కారం లేదని తెలంగాణా బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు స్పష్టంగా చెప్పారు. ఏపీలో రాజకీయం వేరు అక్కడ పరిస్థితులు వేరు, కానీ తెలంగాణా రాజకీయం వేరు పరిస్థితులు వేరు అని ఆయన అంటున్నారు. తెలంగాణాలో బీజేపీ ఈ కారణంగానే పొత్తుల వైపు చూడటం లేదని సొంతంగా పోటీకి సిద్ధపడుతోందని ఆయన వివరిస్తున్నారు.

**ఏపీకి మాత్రమే ఎన్డీయే :**

దీంతో ఏపీకి మాత్రమే ఎన్డీయే పరిమితం అని పక్కా క్లారిటీని అయితే బీజేపీ ఇచ్చేసింది. నిజానికి డబుల్ ఇంజన్ సర్కార్ అని బీజేపీ నినదిస్తుంది. ఎక్కడ అయినా పార్టీలు ఉంటే కలుపుకుని పోతుంది.

కానీ తెలంగాణాలో మాత్రం టీడీపీని వద్దు అనేస్తోంది. అలా కనుక పొత్తు కూడితే బీఆర్ఎస్ కి రాజకీయ ఆయుధంగా మారుతుందని ఏపీకి చెందిన పార్టీతో పొత్తులని బీజేపీని మరింతగా రాజకీయ చెలగాటం ఆడుకుంటారని కలవరపడుతోంది అంటున్నారు. అందువల్లనే టీడీపీని దూరం పెడుతోంది అంటున్నారు. అయితే ఒంటరిగా బీజేపీ పోటీ చేస్తే ఫలితాలు ఎలా ఉంటాయో అన్న చర్చ ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో. ఈ పొత్తుల ఎత్తులలో ముందు ముందు నిర్ణయాలు ఏమైనా మారుతాయామో చూడాలి.